సాక్షి
గుంటూరు

సోమవారం । 8 । జనవరి । 2024



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

భట్టిప్రోలు: పెదపులివర్రులో నూతనంగా పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు ఆదివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



దుర్గమ్మ సేవలో చాగంటి..

విజయవాడ పశ్చిమ: దుర్గమ్మను ప్రముఖ ప్రవచకర్త చాగంటి కోటేశ్వరరావు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈవో కేఎస్ రామారావు, ఈఈ కోటేశ్వరరావు స్వాగతం పలికారు.

బండ్లమ్మకి ప్రత్యేక పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులోని శ్రీ బగళాముఖ బండ్లమ్మ అమ్మవారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని అభయ ప్రదాయినిగా అలంకరించారు. పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో స్పందన రద్దు

నరసరావుపేట: భారత ఎన్నికల సంఘం అధికారుల పర్యటన దృష్టిలో పెట్టుకొని కలెక్టరేట్‌లో సోమవారం జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

ఓటు హక్కు వినియోగం తప్పనిసరి: కలెక్టర్



విజయపురి సౌత్: ప్రతి ఒక్కరూ ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కలెక్టర్ లోతోటి శివశంకర్ తెలిపారు. మాచర్ల మండలంలోని బీకే పాలెం చెంచు కాలనీ, బోధనంపాడు చెంచు కాలనీల్లో ఆదివారం పర్యటించారు. ఓటు హక్కుపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఓటు వేయడం బాధ్యతని తెలిపారు. ప్రతి గడపకూ వెళ్లి చెంచులకు అందుతున్న మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. స్థానికులు పలు సమస్యల్ని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో జి.వి.రమణాకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మల్లు స్వామి, మాచర్ల తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్, డీఎల్ డీవో గభ్రునాయక్, ఎంపీడీవో సరోజినీదేవి, రూరల్ ఆర్ఐ ఫణీంద్రకుమార్, ఎలక్షన్ సెల్ డెప్యూటీ తహసీల్దార్ బాషా, బీఎల్‌వో ఎం. శ్రీనివాసరావు, నాగులవరం వీఆర్వో అంజి పాల్గొన్నారు.

రేపటి నుంచి జాతీయ టీ-20 క్రికెట్ పోటీలు



జే.పంగులూరు: కొండమంజులూరు క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి 16వ తేదీ వరకు గ్రామంలో పానెం హనిమిరెడ్డీస్ కొండమంజులూరు ప్రీమియర్ లీగ్ దేశ స్థాయిలో టీ-20 క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం గ్రామంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. క్రికెట్ క్లబ్ చైర్మన్ కరణం స్వామి మాట్లాడుతూ 29 ఏళ్ల నుంచి దాతల సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలు మొదట్లో రూ.1000 నుంచి ప్రస్తుతం రూ.6 లక్షల వరకు బహుమతులు ఇచ్చేస్థాయికి వచ్చినట్లు వివరించారు. దేశంలో ఐపీఎల్ తర్వాత అతి పెద్ద క్రికెట్ పోటీలు సుమారు రూ.30 లక్షల వ్యయంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఐపీఎల్, రంజిస్థాయి ఆటగాళ్లతో కూడిన జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. పోటీలను వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి సహకారంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.6 లక్షలు హనిమిరెడ్డి అందిస్తున్నట్లు తెలిపారు. రెండో బహుమతి రూ.4 లక్షలు వైఎస్సార్ సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ బీవీ కృష్ణారెడ్డి, మూడో బహుమతి రూ.2 లక్షలు తాను అందిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం షెడ్యూల్ మ్యాచ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్రికెట్ క్లబ్ కమిటీ సభ్యులు వెంకన్నబాబు, వేణుబాబు, రాజాబాబు, శ్రీనివాసరావు, ప్రభాకర్, వీరాంజనేయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆర్జిత సేవలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో మంగళవారం నుంచి అన్ని ఆర్జిత సేవలు యథాతథంగా నిర్వహిస్తామని ఈవో కె.ఎస్. రామారావు పేర్కొన్నారు. భవానీ దీక్ష విరమణలను పురస్కరించుకుని 3వ తేదీ నుంచి ఆర్జిత సేవల టికెట్ల విక్రయాలను దేవస్థానం నిలిపివేసింది. ఆదివారంతో దీక్ష విరమణలు పూర్తి కావడంతో మంగళవారం నుంచి ఉభయదాతలను సేవలకు అనుమతించాలని నిర్ణయించారు. సోమవారం నుంచి సర్వదర్శనంతో పాటు రూ. 100, రూ.300, రూ.500 టికెట్ల విక్రయాలు కొనసాగుతాయని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

సాగర్ నీటి మట్టం



విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 522.80 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 829.00 అడుగుల వద్ద ఉంది.

జీజీహెచ్‌కి కార్పొరేట్ స్థాయి

వైద్యుల సమ్మేళనంలో మంత్రి విడదల రజిని



మంత్రి విడదల రజినీని సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

గుంటూరు మెడికల్: గతంలో ఎన్నడూ లేని విధంగా గుంటూరు జీజీహెచ్‌కి కార్పొరేట్ స్థాయి కల్పించి, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఏపీ డాక్టర్స్ ఇంట్రాక్షన్ మీట్ (సమ్మేళనం) నిర్వహించారు. మంత్రి రజిని మాట్లాడుతూ జీజీహెచ్ క్యాన్సర్ సెంటర్‌ను గ్రేడ్ వన్ లెవల్‌కు పెంచామని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రూ. 20 కోట్ల పెట్ సీటీ స్కాన్ ఇచ్చామని చెప్పారు. సీటీ స్కాన్ పరికరం కొనుగోలుకు రూ. 4 కోట్లు, సర్వీస్ బ్లాక్ నిర్మాణం కోసం రూ.7. 5 కోట్లు ఇచ్చినట్లు వెల్లడించారు.

వైద్యుల సమస్యలపై తక్షణమే స్పందన

ప్రభుత్వ వైద్యుల యూనియన్ నాయకులు, జూనియర్ డాక్టర్స్ యూనియన్ నాయకులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఎరియర్స్ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, ప్రమోషన్స్ ఇచ్చేందుకు కమిటీ వేస్తామని హామీ ఇచ్చారు. పీజీ వైద్యులకు ఎఫ్ఆర్ఎస్ హాజరు విషయంలో మినహాయింపు ఇస్తామని చెప్పారు.

పేదల హృదయాలు గెలవాలి

గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తే వైద్య ఖర్చులు చాలా ఎక్కువగా ఉంటున్నాయని, పేదలు వాటిని భరించలేకపోతున్నారని చెప్పారు. ప్రభుత్వ వైద్యులు చేసే సేవలతో దేవుళ్లుగా పూజింపబడతారని తెలిపారు. వైద్యసేవలతో పేదల హృదయాలు గెలవాలని సూచించారు.

ప్రతి ఇంటికీ వైద్యం

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పేదవాని ఇంటికే వైద్యం తీసుకెళ్లిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు.

రాష్ట్రంలో అత్యధికంగా స్పెషలిస్టు వైద్యులు

డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ ఇండియాలో అత్యధికంగా స్పెషలిస్ట్ డాక్టర్స్‌ను కలిగి ఉంది మన రాష్ట్రమేనని చెప్పారు. దేశంలో ఇతర రాష్ట్రాల్లో 61శాతం వైద్యుల ఖాళీలు ఉంటే ఏపీలో కేవలం నాలుగు శాతం మాత్రమే ఉన్నాయని చెప్పారు. ఒక్క ఖాళీ కూడా లేకుండా అన్ని పోస్టులు భర్తీ చేయడం వల్లే నాణ్యమైన వైద్యసేవలు ఏపీ ప్రజలకు అందుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డీఎంఈ డాక్టర్ సూర్యశ్రీ , డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ పద్మావతి, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి, ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయధీర్, రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ రమేష్, గుంటూరు అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎస్.వి. రమణ, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, జింకానా కో-ఆర్డినేటర్ డాక్టర్ వెనిగళ్ల బాలభాస్కరరావు పాల్గొన్నారు. అనంతరం జూనియర్స్ డాక్టర్స్ అసోసియేషన్, ప్రభుత్వ వైద్యుల సంఘం నేతలు మంత్రి విడదల రజినీని ఘనంగా సన్మానించారు.

సాగర్ నుంచి 5 టీఎంసీల విడుదల

- మంత్రి అంబటి రాంబాబు
- తాగునీటి అవసరాల నిమిత్తం నేటి నుంచి 18 వరకు
- ఏప్రిల్ 8 నుంచి 18 వరకు రెండో విడత



నగరంపాలెం: నాగార్జున సాగర్ కుడి కాలువ నుంచి తాగునీటి అవసరాల నిమిత్తంసోమవారం నుంచి 18 వరకు 5 టీఎంసీలు నీటిని విడుదల చేస్తున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. గుంటూరు విద్యానగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లా డారు. నీటి నిల్వలు తగ్గిన చెరువులు, ట్యాంక్‌లను సాగర్ నీటితో నింపుకోవాలని ఆయన సూచించారు. 11 రోజులపాటు నీరు విడుదల కొనసాగుతుందని, ఒకవేళ 18న నీటిని నిలిపినా, ఎగువ ప్రాంతాల నుంచి రెండు రోజులపాటు విడుదలయ్యే అవకాశం ఉందని తెలిపారు. గత ఏడాది అక్టోబర్‌లో విడుదల చేసిన 5 టీఎంసీలతో చెరువులు, ట్యాంక్‌లు, నీటి గుంతల్లో నిల్వ చేసుకున్నారని మంత్రి అంబటి గుర్తుచేశారు. ఈసారి కృష్ణా నది బోర్డు (కేఆర్ఎంబీ) సమన్వయంతో నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మళ్లీ ఏప్రిల్ 8 నుంచి 18 వరకు రెండో విడతగా 5 టీఎంసీల నీరు విడుదల చేస్తామని చెప్పారు.

విరమణ ఘట్టం పరిసమాప్తం

- ఇంద్రకీలాద్రిపై ముగిసిన భవానీ దీక్షల విరమణ
- 5వ రోజూ తరలివచ్చిన భవానీలు
- 15 లక్షల లడ్డూలు విక్రయం
- అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం



అమ్మవారి దర్శనానంతరం బయటకు వస్తున్న భక్తులు, భవానీలు



హోమ గుండంలో నేతి కొబ్బరి కాయలను వేస్తున్న భవానీలు



యువతికి మాల తీస్తున్న గురు భవాని

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ ఆదివారం దిగ్విజయంగా ముగిసింది. 3వ తేదీ నుంచి ప్రారంభమైన భవానీ దీక్షలు ఆదివారం నిర్వహించిన పూర్ణాహుతితో పరిసమాప్తమయ్యాయి. శనివారం అర్ధరాత్రి 1 గంటకు ప్రారంభమైన అమ్మవారి దర్శనం ఆదివారం సాయంత్రం వరకు కొనసాగింది. ఉదయం 10 గంటలకు మల్లేశ్వరస్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఈవో కేఎస్ రామారావు, వెస్ట్ ఏసీపీ హనుమంతరావు, సీఐ సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పూర్ణాహుతి

దేవస్థాన యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ స్థానాచార్య శివప్రసాద్‌శర్మ, వైదిక కమిటీ సభ్యులు యజ్ఞనారాయణశర్మ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు, వేద పండితులు పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు.

అందరి సహకారంతో దిగ్విజయం

చైర్మన్ రాంబాబు, ఈవో రామారావు మీడియాతో మాట్లాడారు. సీపీ టీకే రాణా, కలెక్టర్ ఢిల్లీరావు, నగర మున్సిపల్ కమిషనర్, ఇతర ముఖ్య శాఖల అధికారుల సహకారంతో దీక్ష విరమణలను దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. భవానీలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. నిత్య అన్నదానంతో పాటు అల్పాహారం నిరంతరాయంగా అందజేశామని తెలిపారు.

ఈ ఏడాది 15 లక్షల లడ్డూలను విక్రయించినట్లు చెప్పారు. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఇతర అధికారులు ఉత్సవాల ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారని పేర్కొన్నారు.

గిరి ప్రదక్షిణలో భక్తుల కోలాహలం

భవానీ దీక్షల విరమణ, గిరి ప్రదక్షణ అంటే కేవలం భవానీలకే కాదు.. నగరవాసులు, భక్తులకు పండుగే! శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి భవానీలతో పాటు నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, ఆలయ సిబ్బంది, అధికారులు, నగరవాసులు భవానీలతో కలిసి అడుగులో అడుగు వేసి, గిరి ప్రదక్షిణ పూర్తి చేశారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమైన రద్దీ ఆదివారం తెల్లవారుజామున 5 గంటల వరకు కొనసాగింది. శనివారం రాత్రి 10 గంటల తర్వాత ప్రతి వెయ్యి మందిలో మూడు వందల మంది భవానీలు ఉంటే మిగిలిన వారు సాధారణ భక్తులే గిరి ప్రదక్షిణ మార్గంలో కనిపించారు. కుమ్మరి పాలెం, విద్యాధరపురం, సితారా, కబేళా, పాలప్రాజెక్టు, చిట్టినగర్, బ్రాహ్మణ వీధి, ఆలయ పరిసరాలలో సాధారణ భక్తులు అధికంగా కనిపించారు. ఇక గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న భవానీలు అర్ధరాత్రి నుంచే క్యూలైన్‌లో వేచి ఉండటంతో ఒంటి గంటకే ఆలయ ద్వారాలను తెరిచారు. దీంతో తెల్లవారుజామున 6 గంటల వరకు ఆలయ పరిసరాలన్నీ భవానీలతో కిటకిటలాడాయి.

దుర్గమ్మ దర్శనానికి నాగసాధువు

ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఆదివారం తెల్లవారుజామున నాగసాధువు దర్శించుకున్నారు. కాశీకి చెందిన శివ విష్ణు బ్రహ్మ రామేశ్వరం పాదయాత్రగా వెళ్తూ మార్గమధ్యలో అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

19న స్మృతి వనం జాతికి అంకితం



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి, అధికారులు

పటమట(విజయవాడ తూర్పు): నగరంలోని స్వరాజ్ మైదాన్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం మేజర్ పనులు పూర్తయ్యాయని, మిగిలిన వాటిని ఈ వారంలో పూర్తి చేయాలని మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం ఇద్దరు స్మృతివనంలో పనుల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో పర్యాటక ప్రదేశంగా స్మృతి వనం మారబోతుందని తెలిపారు. ఈ నెల 19వ తేదీన సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి స్మృతివనం ప్రారంభించి, జాతికి అంకితమిస్తారని ఆమె పేర్కొన్నారు. పనులన్నీ జనవరి 10వ తేదీ నాటికి పూర్తికావాలని కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు.

అంబేడ్కర్ విగ్రహ ప్రారంభం అరుదైన ఘట్టం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్
- నియోజకవర్గాల వారీగా తరలిరావాలని పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న డొక్కా మాణిక్యవరప్రసాద్, నేతలు

నగరంపాలెం: విజయవాడలో ఈనెల 19న 125 అడుగుల రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించడం అరుదైన ఘట్టమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ పేర్కొన్నారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం అభినందనీయమని పేర్కొన్నారు. అంబేడ్కర్ సిద్ధాంతాలు, రచనలను పరిచయం చేస్తూ స్ఫూర్తి కేంద్రంగా నిలవనుందని చెప్పారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో పట్టుదలతో ఈ ఘట్టాన్ని విజయవంతంగా పూర్తి చేశారని కొనియాడారు. అంబేడ్కర్ సిద్ధాంతాలు, ఆలోచనలకు అనుగుణంగా ఆయన పాలన సాగిస్తున్నారని తెలిపారు. 19న జరగనున్న ప్రారంభోత్సవానికి కులాలు, మతాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. మిర్చియార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ పేద ప్రజల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని పేర్కొన్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి మంచి ఆలోచనతో, రాష్ట్ర నడిబొడ్డు విజయవాడలో రూ.404 కోట్లతో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం శుభపరిణామమని తెలిపారు. తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరిఫాతిమా మాట్లాడుతూ అంబేడ్కర్ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని అన్నారు. తొలుత అంబేడ్కర్, వైఎస్. రాజశేఖర్‌రెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జీఎంసీ డెప్యూటీ మేయర్ బాలవజ్రబాబు, డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వై.షేక్, జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు పెరికల కృష్ణమోహన్, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు గరికరూఫస్, నాయకులు పిల్లి మేరి, అన్నాబత్తుని సదాశివరావు, సీడీ భగవాన్, జి.అంజిబాబు, ఎ.జోసఫ్‌బాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పుస్తకం.. శాశ్వత బంధం

- ప్రముఖ సినీనటుడు తనికెళ్ల భరణి
- ముగిసిన విజయవాడ పుస్తక మహోత్సవం



విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రదానం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పుస్తకాలతో స్నేహం చేయడం అంటే ఆనందాన్నిచ్చే శాశ్వత బంధం వంటిందని కవి, రచయిత, నటుడు తనికెళ్ల భరణి అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో జరుగుతున్న 34వ విజయవాడ పుస్తకమహోత్సవం ఆదివారం సాయంత్రంతో ముగిసింది. ముగింపు సభకు తనికెళ్ల భరణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తనికెళ్ల భరణి మాట్లాడుతూవిద్యార్థులు, యువత సెల్‌ఫోన్‌కు బానిసలు కాకుండా ఉండేందుకు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే మాట్లాడుతూ పుస్తకాలను జీవితంలో భాగం చేసుకోవాలని చెప్పారు. మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ పుస్తకాలు తన జీవితంలోని ప్రతి దశలోనూ అభివృద్ధికి, ఆనందానికి కారణమయ్యాయని చెప్పారు. పుస్తక మహోత్సవంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు అతిథులు బహుమతులను అందించారు.

గుంటూరు రేంజ్‌లో 16 మంది సీఐల బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో 16 మంది సీఐలను బదిలీ చేస్తూ ఐజీ జి.పాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
బి.అశోక్‌కుమార్	చిలకలూరిపేట రూరల్ సర్కిల్	నెల్లూరు 1 టౌన్ పీఎస్
వి.శ్రీనివాసరెడ్డి	ఒంగోలు రూరల్ సర్కిల్ (ప్రకాశం జిల్లా)	నాయుడుపేట పీఎస్ (తిరుపతి జిల్లా)
కె.నరసింహారావు	నాయుడుపేట పీఎస్ (తిరుపతి జిల్లా)	సంతమాగలూరు సర్కిల్ (బాపట్ల జిల్లా)
బి.ప్రభాకర్	సంతమాగులూరు సర్కిల్ (బాపట్ల జిల్లా)	రేంజ్ వీఆర్, గుంటూరు
ఎ.రాజామోహన్‌రావు	టి.చుండూరు సర్కిల్ (బాపట్ల జిల్లా)	ఒంగోలు రూరల్ సర్కిల్ (ప్రకాశం జిల్లా)
డి.జగన్‌మోహన్‌రావు	రేంజ్ వీఆర్	నాయుడుపేట సర్కిల్ (తిరుపతి జిల్లా)
వై.వీరాసోమయ్య	నాయుడుపేట సర్కిల్ (తిరుపతి జిల్లా)	రేంజ్ వీఆర్, గుంటూరు
జి.దశరథరామయ్య	రేంజ్ వీఆర్, గుంటూరు	తెనాలి 1 టౌన్ పీఎస్, గుంటూరు జిల్లా
కె.చంద్రశేఖర్	తెనాలి 1 టౌన్ పీఎస్ గుంటూరు జిల్లా	రేంజ్ వీఆర్, గుంటూరు
ఖాజా అల్తాజ్ హుస్సేన్	పొన్నూరు టౌన్ పీఎస్, గుంటూరు జిల్లా	నెల్లూరు 4 టౌన్ పీఎస్
బి.వి.వి.సుబ్బారావు	నెల్లూరు 4 టౌన్ పీఎస్	రేంజ్ వీఆర్, గుంటూరు
సి.కృష్ణారెడ్డి	కమాండ్ కంట్రోల్ సెంటర్, తిరుపతి జిల్లా	నరసరావుపేట 1 టౌన్ పీఎస్
ఎ.అశోక్‌కుమార్	నరసరావుపేట 1 టౌన్ పీఎస్, పల్నాడు జిల్లా	డీసీఆర్‌బీ, పల్నాడు జిల్లా
ఎస్.నాగమల్లేశ్వరరావు	డీసీఆర్‌బీ, పల్నాడు జిల్లా	రేంజ్ వీఆర్, గుంటూరు
యు.శోభన్‌బాబు	ట్రాఫిక్ పీఎస్, పల్నాడు జిల్లా	డీటీఆర్‌బీ/ డీటీసీ, పల్నాడు జిల్లా
టి.విజయకృష్ణ	డీటీఆర్‌బీ/ డీటీసీ, పల్నాడు జిల్లా	రేంజ్ వీఆర్, గుంటూరు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


సంఘటనా స్థలిలో ప్రసాద్ మృతదేహం

గుంటూరు రూరల్: ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని బసవ తారకరామ నగర్ రెండవ లైనుకు చెందిన దండిబోయిన ప్రసాద్(44) చిలకలూరిపేట నుంచి గుంటూరుకు తన ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో లాలుపురం సమీపంలో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో ప్రసాద్ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు.పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు


తాళ్లచెరువులో మాట్లాడుతున్న రాష్ట్ర సంబంధాల కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డి

అచ్చంపేట: రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని రాష్ట్ర సమాచార ప్రజా సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తాళ్లచెరువు గ్రామాన్ని ఆదివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. విజయకుమార్ రెడ్డిని గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, సర్పంచి కిక్కురు అర్లా రెడ్డి, మాజీ సర్పంచి తుమ్మా చిన్నపరెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ బాలశౌర్రెడ్డి, రైతు నాయకుడు లూర్దుమర్రెడ్డి పాల్గొన్నారు.

యువత భవితకు వారధులు తల్లిదండ్రులే

యువజన సర్వీసుల ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న


ప్రద్యుమ్నను సత్కరిస్తున్న యువజన సర్వీసుల కమిషనర్ శారదాదేవి, తదితరులు

తాడేపల్లిరూరల్ : యువతను పెడదారి పట్టకుండా సరైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని యువజన సర్వీసుల ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న అన్నారు. ఆదివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కెఎల్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యువజన ఉత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ యువతకు సరైన దిశా నిర్దేశం చేయడానికి స్వామి వివేకానంద లాంటి ఆధ్యాత్మిక గురువులు అవసరమన్నారు. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న యువజన ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన యువజన బృందాలు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం సంతోషకరమన్నారు. రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ కమిషనర్ శారదాదేవి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచిన యువతీ యువకులను ఈ నెల 10వ తేదీన ప్రత్యేక బస్సుల ద్వారా మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే జాతీయ యువజన ఉత్సవాలకు పంపిస్తామని అన్నారు. జిజ్ఞాస ఫౌండేషన్ డైరెక్టర్ భార్గవ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యువజన ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయని అన్నారు. యువతీ యువకులకు పోటీలతో పాటు సమ్మిట్లను, అవగాహనా సదస్సులను నిర్వహిస్తున్నామని చెప్పారు. రానున్న కాలంలో యువతీ యువకులు స్టార్టప్‌లుగా, పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి అనేకమందికి ఉద్యోగాలను ఇచ్చే స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువజన సర్వీసుల శాఖ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.వి. రామకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ స్వామి, వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్. హనుమంతరావు, ప్రిన్సిపల్ డాక్టర్ కె. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువులు కొనసాగించాలి

ఎమ్మెల్సీ లక్ష్మణరావు



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణరావు

పెదకాకాని: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ప్రణాళికతో కష్టపడితే జీవితంలో ఏదైనా సాధించవచ్చునని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామ శివారులో గల కొండిన్యపురం లోని కొండిన్య ఐఏఎస్ అకాడమీ భవనంలో కొండిన్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనాల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు హాజరైన ఈ కార్యక్రమానికి ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ఈవి నారాయణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కెయస్ లక్ష్మణరావు మాట్లాడుతూ అధ్యాపక ఉద్యమాలలో అత్యంత కీలకపాత్ర పోషించిన డాక్టర్ ఇవి నారాయణ ప్రిన్సిపల్‌గా పదవీ విరమణ పొందిన తర్వాత కొండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్టు స్థాపించి మంచి మార్పుకు విద్య ఒకటే మార్గమని భావించారన్నారు. ఈ క్రమంలో కొండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్టు స్థాపించి ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. స్కాలర్ షిప్ పొందిన విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత పదవులు అందుకోవాలని ఎమ్మెల్సీ కెయస్ లక్ష్మణరావు ఆకాంక్షించారు. కమర్షియల్ టాక్స్ విశ్రాంత అదనపు కమిషనర్ వై సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఐఏఎస్ అకాడమీ భవనం ఎంతోమంది దాతల శ్రమ, విరాళాల ఫలితం అన్నారు. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు అన్నారు. అన్ని సదుపాలను అందరికీ ప్రభుత్వం కల్పించలేదని కొండిన్య ఐఏఎస్ అకాడమి వంటి సంస్థలు భాగస్వాములు కావాలని అన్నారు. సభాధ్యక్షులు ఈవీ నారాయణ మాట్లాడుతూ కేవలం ముగ్గురితో ప్రారంభమైన స్కాలర్ షిప్స్ నేటికి 6వేల మందికి ఇచ్చే స్థాయికి ఎదిగిందన్నారు. ఇప్పటివరకు రూ.1.90 కోట్ల రూపాయలు స్కాలర్‌షిప్ గా ఇవ్వటం జరిగిందన్నారు. ఆదివారం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రతిభా స్కాలర్‌షిప్‌లు అందుకునేందుకు 410 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. వారికి రూ.18 లక్షలు పంపిణీ చేశారు. కొండిన్య ఐఏఎస్ అకాడమీ ద్వారా ఇప్పటికే గ్రూపు 2 పరీక్షలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. సభలో పాల్గొన్న టొబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి అద్దంకి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను ప్రోత్సహించడంలో కొండిన్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమన్నారు. హెల్త్ సెక్రటరీ డాక్టర్ మంజుల టాటా మాట్లాడుతూ ముగ్గురితో ప్రారంభమైన ఎడ్యుకేషన్ ట్రస్ట్ నేడు వేల మందికి స్కాలర్ షిప్స్ ఇచ్చే స్థాయికి ఎదగడం ఎంతో అభినందనీయమన్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షలకు సకల సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి ఇనిస్టిట్యూషన్ కరస్పాండెంట్ ఎస్ పూర్ణచంద్రరావు, ప్రముఖ ఆడిటర్ నండూరి ఆనందకృష్ణ, విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ కె అశోక్ రావు, పారిశ్రామికవేత్త ఆర్ ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి, వాకా రాంగోపాల్‌గౌడ్, వడ్డెంగుంట సుబ్బారావు, జల్లెడ శ్రీనివాసరావు, బొబ్బిళ్ల వెంకటేశ్వరరావు, వీరంకి రంగారావు, పీతా సుబ్బరామయ్య, చిలక చంద్రమౌళి, బెల్లంకొండ సదాశివగౌడ్, కారంకి లక్ష్మీనారాయణ, డి సత్యనారాయణ, డాక్టర్ టి సేవ కుమార్, డాక్టర్ తాతా సాంబశివరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గౌడ జన సేవా సమితి సభ్యులు, కొండిన్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు సంకల్ప బలంతో ముందుకు సాగాలి

రాష్ట్ర మాజీ ఎన్నికల అధికారి రమేష్‌కుమార్


జాస్తి వెంకటేశ్వర్లు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిమ్మగడ్డ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: కృషి, పట్టుదలతో విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలని రాష్ట్ర మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం జేకేసీ కళాశాలరోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్లో కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 299 మంది విద్యార్థులకు రూ.49 లక్షల ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. రమేష్ కుమార్ మాట్లాడుతూ జీవితంలో ఏదైనా సాధించాలనే కసి ఉండాలని, అవకాశాలను సృష్టించుకోవాలని సూచించారు. సొసైటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె. బసవపున్నయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు కొంత వరకైనా సహాయం అందించాలనే ఆశయంతో 2003లో స్థాపించిన కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా ప్రతి ఏటా పెద్ద ఎత్తున ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. మరింత ఎక్కువ మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థుల చదువుల కోసం సహృదయం కలిగిన దాతలు ఇస్తున్న విరాళాలతో ప్రతి ఏటా ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్నామని, భవిష్యత్తులో మరింతగా ముందుకు తీసుకువెళతామని చెప్పారు. సొసైటీ కార్యదర్శి డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఒక్కో విద్యార్థికీ రూ.17వేలు చొప్పున 299 మంది విద్యార్థులకు రూ.49 లక్షల ఉపకార వేతనాలను చెక్కుల రూపంలో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దాతల ఉద్దేశాన్ని గుర్తెరిగి, వారి ఆశయాలకు అనుగుణంగా ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని సూచించారు. సంస్థ కోశాధికారి డాక్టర్ పుట్టగుంట వేణుగోపాలరావు మాట్లాడుతూ అమెరికాలో స్థిరపడిన తెలుగు ప్రముఖులతో పాటు కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన ప్రముఖులు కలిసి విద్యార్థుల చదువులకు ఆర్థికంగా తోడ్పాటు అందించాలనే ఆశయంతో స్థాపించిన కాకతీయ సొసైటీ ద్వారా ప్రతి ఏటా లక్షలాది రూపాయలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ముందుగా సొసైటీ వ్యవస్థాపకుడు డాక్టర్ జాస్తి వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు నామినేని కోటేశ్వరరావు, జి. గోవర్ధనరావు, నన్నపనేని సదాశివరావు, జాస్తి కృష్ణకుమారి, మద్దినేని గోపాలకృష్ణ, కావూరి ప్రసాద్‌రావు, సామినేని కోటేశ్వరరావు, ఎన్. ప్రభాకరరావు కేఎల్‌పీ స్కూల్ ప్రిన్సిపాల్ వై. రధినీచౌదరి, పి. నాగ సుశీల, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

13న మాచర్లలో 'మనం పాడుదాం'

మాచర్ల: సంక్రాంతిని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో జనవరి 13వ తేదీన తెలుగు రాష్ట్రాల స్థాయి 'మనం పాడుదాం' పాటల పోటీలు నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ సాంస్కృతిక జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ కమలాసనరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది ఉమ్మడి రాష్ట్రంలోని గాయనీ గాయకులను ప్రోత్సహించేందుకు పాటల పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మాచర్ల పట్టణంలోని మానుకొండ కల్యాణ మండపంలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

వివాహిత దారుణ హత్య

పిడుగురాళ్ల: వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ మహిళ ప్రియుడి చేతిలో దారుణ హత్యకు గురైన ఘటన మండలంలోని పాతగణేశునిపాడులో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పట్టణ సీఐ వీవీ ఆంజనేయులు తెలిపిన వివరాలు.. పిడుగురాళ్ల పట్టణంలోని మేదర బజారుకు చెందిన వజ్రగిరి పాపులమ్మ అలియాస్ జ్యోతి(35), పాతగణేశునిపాడులోని ఎస్టీ కాలనీకి చెందిన ధీకొండ కిరణ్‌కుమార్ వంట మాస్టర్‌గా స్థానిక ఓ హోటల్‌లో పని చేస్తున్నారు. ఆమె భర్త గతంలో చనిపోయాడు. కిరణ్‌కుమార్ భార్య నాలుగేళ్ల క్రితం లివర్ క్యాన్సర్‌తో చనిపోయింది. దీంతో ఇద్దరు సహజీవనం చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా మృతురాలు వజ్రగిరి పాపులమ్మకు అంతకుముందు నాగరాజు అనే వ్యక్తితో పరిచయం ఉండడంతో అనుమానం పెంచుకున్నాడు. ఇదే విషయంపై తరచూ గొడవ పడుతున్నారు. ఈ నెల 6వ తేదీ పాపులమ్మ, కిరణ్‌కుమార్‌తో కలసి పాతగణేశునిపాడులోని కిరణ్‌కుమార్ ఇంటికి వెళ్లింది. కిరణ్‌కుమార్, పాపులమ్మకు నాగరాజు విషయమై గొడవ జరిగింది. ఈ గొడవ ఆగ్రహానికి దారి తీసి కిరణ్‌కుమార్ అక్కడే ఉన్న రోకలి బండతో పాపులమ్మ తల మీద బలంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే చనిపోయింది. దీంతో నిందితుడు కిరణ్‌కుమార్ పారిపోయాడు. ఆదివారం మృతురాలి పాపులమ్మ చెల్లెలు రాణి మృతురాలికి ఫోన్ చేస్తుండగా రింగ్ అవుతున్నా లిఫ్ట్ చేయకపోవటంతో అనుమానం వచ్చి పాతగణేశునిపాడు వచ్చి చూసింది. దీంతో రక్తపు మడుగులో పాపులమ్మ చనిపోయి ఉండటంతో పట్టణ పోలీసులకు సమాచారం అందించింది. దీంతో విషయం తెలుసుకున్న గురజాల డీఎస్పీ పల్లపు రాజు, పట్టణ సీఐ వీవీ ఆంజనేయులుతో పాటు ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ ఘటనా స్థలానికి చేరుకొని మృతికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఆంజనేయులు పేర్కొన్నారు.

మృత్యుంజయరావుకు జీవితకాల సాఫల్య పురస్కారం అందజేత

హాజరైన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ రాజశేఖర్


మృత్యుంజయరావు దంపతులకు జీవితకాల సాఫల్య పురస్కారం అందజేస్తున్న వీసీ రాజశేఖర్

తెనాలి: నాలుగు పీజీలు, మరికొన్ని డిగ్రీలను పూర్తిచేసి ఆరు పదుల వయసులోనూ నిత్య విద్యార్థిగా యూనివర్సిటీలో సంగీత విద్యను అభ్యసిస్తున్న సామాజిక సేవకుడు మొవ్వా మృత్యుంజయరావును తమ యూనివర్సిటీ బ్రాండ్ అంబాసిడర్‌గా భావిస్తున్నానని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ అన్నారు. బాపట్ల జిల్లా అమృతలూరు మండల గ్రామం మూల్పూరుకు చెందిన మొవ్వా మృత్యుంజయరావు న్యాయవాద కోర్సుతో సహా పలు డిగ్రీలు, నాలుగు పీజీలు పూర్తి చేశారు. ప్రస్తుతం నాగార్జున యూనివర్సిటీలో సంగీత పాఠాలను అభ్యసిస్తున్నారు. గుంటూరు కేంద్రంగా మొవ్వాస్ ఎడ్యుకేషనల్ ఎంకరేజ్‌మెంట్ ట్రస్ట్‌ను స్థాపించి, అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు, మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు నగదు పురస్కారాలను పంపిణీ చేస్తున్నారు. పేదలను ఆదుకోవటం, జిల్లా కలెక్టరేట్‌లో స్పందనకు వచ్చే నిరక్షరాస్యులకు దరఖాస్తులు పూర్తిచేసివ్వటం, నెలకు 20 రోజుల పాటు ఏదో ఒక బ్యాంకులో ఖాతాదారులకు ఉచిత కన్సల్టెన్సీ సేవలను అందిస్తున్నారు. వీరి సేవలకు గుర్తింపుగా పట్టణానికి చెందిన తెనాలి రామకృష్ణ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో మృత్యుంజయరావుకు జీవితకాల సాఫల్య పురస్కారాన్ని బహూకరించారు. అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ మాట్లాడుతూ ఆరుపదుల వయసు దాటినా ఇంకా పలు పీజీలు, డిగ్రీలు చేస్తూ సంగీతవిద్యను అభ్యసిస్తున్న మృత్యుంజయరావు నేటి యువతకు మార్గదర్శకులని చెప్పారు. ఆయనకు ఇచ్చిన అవార్డు యూనివర్సిటీకి ఇచ్చినట్టుగా భావిస్తున్నానని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేజీ శంకర్ తన ప్రసంగంలో యూనివర్సిటీలో సంగీత విద్యను అభ్యసిస్తున్న తనకు మృత్యుంజరావుతో అనుబంధం ఏర్పడిందన్నారు. నిస్వార్థంగా ఆయన అందిస్తున్న సమాజసేవను, నిరక్షరాస్యులకు తోడ్పడుతున్న తీరును వివరించారు. సభలో జేసీ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సుధాకరబాబు, యూనివర్సిటీ పెర్ఫార్మింగ్ అండ్ ఫైన్ ఆర్ట్స్ డీన్ డాక్టర్ జి.అనిత, విశ్రాంత జిల్లా విద్యాధికారి డాక్టర్ ఎన్.రఘుకుమార్, చింతలపాటి మంజుల, గల్లా మధుసూదనకుమార్ తమ ప్రసంగాల్లో మృత్యుంజయరావు సేవానిరతిని అభినందించారు.

కంటి, గుండె పరీక్షల వైద్యశిబిరానికి స్పందన


శిబిరానికి హాజరైన వారితో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

నగరంపాలెం: ప్రతి వాగ్దానాన్ని అమలుచేసిన సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమంలో భాగంగా ఆదివారం పొన్నూరు మండలం బ్రాహ్మణకోడూరు గ్రామంలో ప్రజలకు కంటి, గుండె పరీక్షలు నిర్వహించారు. ఫిజియోథెరపీ సేవలను పలువురు వినియోగించుకున్నారు. 30 మందికి యాంజియోగ్రామ్ సూచించగా ఈ నెల 9న విజయవాడ తీసుకెళ్లనున్నారు. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పాలనలో పేదల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్నారని అన్నారు. బజరంగ్ ఫౌండేషన్ అంకిత భావంతో ప్రజా సేవను కొనసాగిస్తున్నట్లు చెప్పారు. గత ఏడాది నుంచి కంటి సమస్యలను నివారించేందుకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. అవసరమైన వారికి ఏడు రోజుల్లో కళ్లజోళ్లను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. 'మీ గుండె పదిలం' కార్యక్రమంలో భాగంగా ఉచిత గుండె పరీక్షలు, యాంజియోగ్రామ్ పరీక్షలు చేయిస్తున్నామని వ్యాధి తీవ్రతను ఆధారంగా చేసుకుని అవసరమైన వారికి స్టంట్స్/ బైపాస్ శస్త్రచికిత్సలు చేయించామని తెలిపారు. దివ్యాంగ దర్శిని కార్యక్రమంలో భాగంగా దివ్యాంగులకు ట్రైసైకిల్స్ పంపిణీ చేశామని చెప్పారు. ఈ శిబిరానికి వృద్ధులు, మహిళా దివ్యాంగులను ప్రత్యేక వాహనాల ద్వారా తీసుకువచ్చి వైద్య పరీక్షలు చేయించారు. శిబిరం ఏర్పాటుపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ ప్రాజెక్టు బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్‌ను ఆవిష్కరించిన సంస్థ చైర్మన్ రామచంద్రరావు, తదితరులు

పాత గుంటూరు: మూస పద్ధతిలో కొనసాగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారంలో సమూలమైన మార్పులు చేపట్టి వినూత్న ఆలోచనలు, అద్భుత వెంచర్లతో గృహ నిర్మాణ రంగంలో అద్భుతాలు సృష్టిస్తున్న శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బాపట్ల బీచ్ ఎదురుగా 'అలోహ బీచ్ రిసార్ట్' పేరుతో ఒక విలాసవంతమైన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా గుంటూరు వెల్‌కమ్ హోటల్‌లో ఘనంగా బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ ప్రీ-లాంచ్ కార్యక్రమాన్ని భ్రమర హౌసింగ్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచంద్రరావు ప్రారంభించగా, సంస్థ డైరెక్టర్లు మారం చంద్ర శేఖర్, ఎం.ఎస్ రాజు, ఎంపికె లక్ష్మీపతి రాజు, కోట శైలారెడ్డి, యడ్లపల్లి మురళీకృష్ణ, రావెల గోపాలకృష్ణ పాల్గొన్నారు. రామచంద్రరావు మాట్లాడుతూ అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న ప్రస్తుత సమాజానికి విలాసవంతమైన జీవన శైలిని అందించడానికి రియాల్టీ, నిర్మాణ రంగాల్లో అత్యాధునిక పోకడలతో శరవేగంగా దూసుకుపోతున్న శ్రీ భ్రమర చేపట్టిన అద్భుతమైన ప్రాజెక్టు 'అలోహ బీచ్ రిసార్ట్'.. వెడ్డింగ్ డెస్టినేషన్, కార్పొరేట్ మీట్స్, ఫ్యామిలీ హాలిడేస్ ట్రిప్‌కు అనువుగా ఉంటుందని పేర్కొన్నారు. థీమ్ పార్క్, వాటర్ స్పోర్ట్స్, ఫుడ్ కోర్ట్, బీచ్ ఫ్రంట్ హోటల్, హార్స్ రైడింగ్, బీచ్ వాలీబాల్, కిడ్స్ ప్లే జోన్ వంటి ఎన్నో సదుపాయాలు కలిగిన ఈ బీచ్ రిసార్ట్‌లో బీచ్ ఫ్రంట్ ప్లాట్స్, కాటేజెస్, విల్లాస్ వినియోగదారులకు అందుబాటు ధరల్లో లభిస్తాయన్నారు. కార్యక్రమంలో చెన్నంశెట్టి సతీష్ బాబు, కల్వకోట సాయి శంకర్, సీనియర్ మార్కెటింగ్ మేనేజర్లు, మార్కెటింగ్ టీమ్ సిబ్బంది, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

భార్యను హతమార్చిన భర్త

- కారెంపూడి తండాలో దారుణం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ పల్లపు రాజు


దేవిబాయి మృతదేహం


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ పల్లపు రాజు, సీఐ జయ కుమార్, ఎస్ఐ రామాంజనేయులు

కారెంపూడి: భార్యను చేతులు కట్టేసి నీటి రమ్ములో ముంచి హత్యకు పాల్పడిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు.. కారెంపూడి తండాకు చెందిన రమావతు బర్మానాయక్, దేవిబాయి(34) భార్యాభర్తలు. 17 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. దేవిబాయి మేనమామ కుమార్తె. వీరికి ముగ్గురు పిల్లలు. వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. బర్మానాయక్ ప్రస్తుతం 4 ఎకరాలలో మిర్చి పంట సాగు చేస్తున్నాడు. కల్లంలో ఉన్న మిరప కాయలకు కాపలాకు రాత్రి 9 గంటలకు భార్యాభర్తలు పొలం వెళ్లారు. అక్కడే భార్య చేతులు కట్టేసి నీటి రమ్ములో ముంచి హత్య చేసినట్లు గుర్తించారు. బర్మానాయక్‌కు వివాహేతర సంబంధాలున్నాయని ఈ నేపథ్యంలోనే భార్యభర్తల మధ్య జరిగిన గొడవలో భార్యను హతమార్చాడని భావిస్తున్నారు. దానితో పాటు తన మామ బాబూనాయక్ తాయెత్తులు వేస్తాడని తన కుటుంబానికి చేతబడి చేయించాడని అందుకే హత్యకు పాల్పడినట్లు నిందితుడు పోలీసులకు చెబుతున్నట్లు సమాచారం. మొదట తనతో పాటు తన తల్లిదండ్రులు కూడా హత్యలో పాల్గొన్నారని పోలీసులకు చెప్పుకొచ్చాడు. మృతురాలి తండ్రి బాబూనాయక్, బర్మానాయక్ తల్లి శామినిబాయి అక్కాతమ్ముళ్లు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ పల్లపు రాజు పరిశీలించారు. ఆయన వెంట సీఐ జయకుమార్, ఎస్ఐ రామాంజనేయులు ఉన్నార. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చని కాపురాన్ని కూల్చుకున్నాడు..

భార్యాభర్తలు కష్టపడి పని చేసుకుంటున్నారు. నాలుగెకరాలలో మిర్చి వేశారు. మిర్చి కూడా బాగుంది. 70 క్వింటాళ్ల వరకు మిరప కాయలు అయ్యేలా ఉన్నాయి. ముగ్గురు పిల్లలు బాగా చదువుకుంటున్నారు. ఈ దశలో మద్యం మత్తులో పుట్టిన దుర్బుద్ధితో కట్టుకున్న భార్యనే హత్యచేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో కారెంపూడి తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులు శామనిబీయి, లాలూనాయక్ దంపతులు కూడా బాగా కష్టపడి పనిచేసి పంటలు బాగా పండిస్తారనే పేరుంది.